ప్రజాశక్తి
శుక్రవారం 10 ఫిబ్రవరి 2023
5
శ్రీ సత్యసాయి



లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిద్దాం : డిఐజి

అనంతపురం : ఈనెల 11వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో అందరూ సమన్వయంతో పనిచేసి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిఐజి రవిప్రకాష్ పోలీసు సిబ్బందికి సూచించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల సిఐలు, ఆపై స్థాయి పోలీసు అధికారులతో గురువారం నాడు ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. రాజీమార్గం ప్రాధాన్యతను ఇరు వర్గాల వారికి తెలియజేసి లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు అధికారులు కేసుల తగ్గింపు నిమిత్తం సంబంధిత న్యాయమూర్తులతో సంప్రదించి పెండింగ్ కేసులను తగ్గించేలా కృషి చేయాలన్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రానున్న రోజుల్లో స్పెషల్ బ్రాంచి విభాగాలు మరింత చురుగ్గా పని చేయాలన్నారు. నిరంతర నిఘా ఉంచి అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి, రాహుల్‌దేవ్ సింగ్‌తో పాటు రెండు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.



అమరాపురం మండలం కెంకెర గ్రామంలో రేషన్ షాపు వద్ద బియ్యాన్ని తీసుకెళ్లలేక సాయం కోసం వేచిఉన్న వికలాంగురాలు

ఇంటివద్దకు రాద(బ)ండి..!

రేషన్‌దారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి-అమరాపురం

ఇంటి వద్దనే రేషన్ బియ్యాన్ని అందిస్తాం అన్న ప్రభుత్వం మాటలు ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికే చాలా గ్రామాల్లో రేషన్‌షాపుల వద్దనే పంపిణీ జరుగుతోంది. షాపుల వద్ద నుంచి బియాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాలు ఎక్కడున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. మడకశిర నియోజకవర్గంలోని చాలా మండలాల్లో ఇలాంటి పరిస్థితి కన్పిస్తోంది. అమరాపురం మండల పరిధిలోని కెంకెర గ్రామంలో గురువారం నాడు రేషన్‌షాపు ద్వారా బియ్యం పంపిణీ చేశారు. దుకాణంలో రేషన్ బియ్యం తీసుకున్న ఓ వికలాంగురాలు దానిని మోసుకెళ్లలేక ఆ బియ్యం మూటను పక్కన ఉంచుకుని షాపు వద్దనే కూర్చొంది. బియ్యాన్ని ఇంటి వద్దకు తీసుకెళ్లేందుకు ఇతరుల సాయం కోరుతూ కన్పించింది. ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ బియ్యం తీసుకెళ్లే వాహనాలు ఎక్కడికెళ్లాయంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి అన్ని గ్రామాల్లో రేషన్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మోగిన మండలి నగారా



- ◆ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు షెడ్యూల్
- ◆ ఫిబ్రవరి 16న నోటిఫికేషన్
- ◆ మార్చి 13న ఎన్నికలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యుల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది మార్చి 29వ తేదీ నాటికి ఇప్పుడున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిల పదవీకాలం పూర్తవనుంది. ఇప్పటికే ఈ రెండు స్థానాలకు పోటీపడే వారు రంగంలోకి దిగారు. ఎన్నిలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే అవుత్సాహిక అభ్యర్థులు ఓటర్ల నమోదులో క్రియాశీలకంగా పనిచేస్తూనే ప్రచారాలు చేసుకునే పనిలోనున్నారు. ఇప్పుడు అధికారికంగా ఎన్నికల సంఘం షెడ్యుల్‌ను విడుదల చేయడంతో ఎన్నికల వేడి మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

ఫిబ్రవరి 16న నోటిఫికేషన్, మార్చి 13న ఎన్నికలు

అనంతపురం, కర్నూలు, కడప పాత జిల్లాలు కలిపి రాయలసీమ పశ్చిమ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలుగా ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాలకు ఇప్పుడు ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యుల్ ప్రకారం ఫిబ్రవరి 16వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. అదే రోజు నుంచి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఫిబ్రవరి 23వ తేదీన నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుంది. ఫిబ్రవరి 24వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ జరుగుతుంది. ఫిబ్రవరి 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఆ తరువాత ప్రచారాలకు సమయం ఉంటుంది. మార్చి 13వ తేదీన పోలింగ్ జరుగుతుంది. మార్చి16వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగనుంది.

ఇప్పటికే ప్రధాన అభ్యర్థులు రంగంలోకి...

ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందు నుంచే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలు అభ్యర్థులను సైతం ప్రకటించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోతుల నాగరాజు ఉన్నారు. ఆయనకు వామపక్ష పార్టీలతో పాటు ఉద్యోగ, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. మూడు జిల్లాల్లోనూ ఆయన విజయాన్ని కాంక్షిస్తూ అందరూ కృషిచేస్తున్నారు. ఇక అధికార వైసిపి నుంచి ఇప్పుడున్న ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి కుమారుడు వెన్నపూస రవీంద్రారెడ్డిని బరిలో దింపారు. ప్రతిపక్ష టిడిపి నుంచి కడప జిల్లాకు చెందిన రామ్‌గోపాల్‌రెడ్డి పేరు ఖరారు చేశారు. వీరుకాకుండా మరికొంత మంది స్వతంత్రంగా బరిలో దింగేందుకు సిద్ధమై ఉన్నారు. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం ఎమ్మెల్సీగానున్న కత్తి నరసింహారెడ్డి మరోమారు బరిలో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఆయనకు ఉద్యోగ, కార్మిక సంఘాల మద్దతు ఉంది. ఆయన కాకుండా ఇతర నేతలు బరిలో దిగడమే కాకుండా ఉపాధ్యాయులకు తాయిలాల ద్వారా ఎరవేసే ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. జిల్లాలో టిఫిన్ బాక్సులను పంపిణీ చేయడం బహిర్గతం కావడం జరిగింది.



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్

సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో

విద్యార్థులకు రాగిమాల్ట్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రాగి మాల్ట్ పంపిణీ చేసేందుకు సత్యసాయి ట్రస్ట్ ముందుకొచ్చింది. ఈ మేరకు ట్రస్టు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌తో పాటు సభ్యులు గురువారం నాడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని సిఎం క్యాంపు కార్యాలయంలో కలిసి పౌష్టిక ఆహారమైన రాగి మాల్ట్‌ను సరఫరా చేయడానికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనంతోపాటు రాగి మాల్ట్ అందిస్తే విద్యార్థుల హాజరు పెరుగుతుందని భావించి సత్యసాయి ట్రస్టును కలెక్టర్ బసంత్ కుమార్, డీఈవో సంప్రదించారు. ఈ విషయాన్ని గత నెల జనవరి 11న ప్రభుత్వానికి నివేదించారు. ఈ నివేదిక మేరకు ట్రస్టు ప్రతినిధులతో పాటు కలెక్టర్ ముఖ్యమంత్రిని కలసి బెల్లం, రాగి పిండి కలిపిన రాగి మాల్ట్ అందించడానికి ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 44,392 పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న 38 లక్షల మంది విద్యార్థులకు రాగి మాల్ట్ అందించనున్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలోని 679 మండలాల్లో ఈ బహత్తర కార్యక్రమాన్ని చేపట్టేలా సత్యసాయి ట్రస్టు ముందుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సత్యసాయి సేవాసమితుల ద్వారా దీనిని అందించేలా ట్రస్టు చర్యలు తీసుకుంది.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

రైతు, కార్మిక, కర్షక, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీల, మధ్యతరగతి వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రశ్నించే గొంతుకగా పశ్చిమ రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను గెలిపించుకుందామని పలు ప్రజా, కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. అనంతపురం రామ్‌నగర్ యాదవ కళ్యాణమండపంలో గురువారం సాయంత్రం వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సూర్యుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.రాంభూపాల్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు జాఫర్, పాళ్యం నారాయణస్వామి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో పేద, మధ్యతరగతి కుటుంబాలు భయాందోళనకు గురువుతున్నారని తెలిపారు. ఉద్యోగులకు 1వ తేదీ వేతనాలు వచ్చే రోజులు పోయి 10వ తేదీ వచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. ఫేస్‌యాప్ హాజరంటూ తీవ్ర ఆందోళనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నెట్టివేయబడ్డారని తెలిపారు. ఇలాగే ప్రభుత్వ పాలనా విధానాలు కొనసాగితే అభ్యుదయ భావాలతో మెలుగుతున్న ప్రజాస్వామ్యం కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. కనీసం హక్కులను అడిగే స్వేచ్ఛను ప్రభుత్వాలు హరిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం కరపత్రాలు కూడా పంపిణి చేయనివ్వని ప్రభుత్వం అధికార పార్టీ మద్దతుదారులు పాఠశాలల్లో టిఫిన్ బాక్సులు పంపిణీ చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నియంతృత్వ విధానాలు అమలు జరుగుతున్న పరిస్థితుల్లో ప్రజా గొంతుగా పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవడం అందరి బాధ్యత అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం ఎంతటి చర్యలకైనా దిగజారే ప్రమాదం ఉందన్నారు. వాటి పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వి.రామిరెడ్డి, ఆర్వి.నాయుడు, వెంకట నారాయణ, ఎఐటియుసి జిల్లా నాయకులు శ్రీరాములు, లింగమయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, ఏఐఎస్ఎఫ్ఐ కుళ్ళాయిస్వామి, డిఐవైఎఫ్ రాజేష్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి చేతన్

33,990 మంది ఓటర్ల నమోదు : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో నూతనంగా 33,990 ఓటర్ల దరఖాస్తులను ఆమోదించినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి ఎం.కె మీనా జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నికల అధికారి నూతన ఓటర్ల నమోదు, చిరునామ మార్పు, ఫొటో గుర్తింపు కార్డులు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే ప్రక్రియలో కళాశాల విద్యార్థులతో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టామన్నారు. ఫారం 6 కి చెందిన 21,988 దరఖాస్తులు రాగా 2,384 తిరస్కరించినట్లు తెలిపారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాలో 54 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. అన్ని డివిజన్ కేంద్రాలలో ప్రత్యేక ఎన్నికల సెల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఒ కొండయ్య, కదిరి, పుట్టపర్తి, హిందూపురం, మడకశిర, ధర్మవరం, పెనుకొండ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించి..ఆదుకోండి..

రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకుల ఆందోళన

హిందూపురం : పురపాలక సంఘం నూతనంగా నిర్మించిన వాణిజ్య, కూరగాయల మార్కెట్ సముదాయ భవనం కింద భాగంలో పూల వ్యాపారులకు స్థలాన్ని కేటాయించి ఆదుకోవాలని రాజకీయ పార్టీల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థలం కేటాయించాలని కోరుతూ గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ముందు పూల వ్యాపారులతో కలిసి నాయకులు ఆందోళన చేశారు. అనంతరం కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత మార్కెట్ ఉన్న సమయంలో పూల మార్కెట్ అదే ఆవరణలో ఉండేదన్నారు. నూతన మార్కెట్ నిర్మాణంలో భాగంగా పాత మార్కెట్‌ను తొలగించినప్పుడు, పూల వ్యాపారులందరికీ నూతన మార్కెట్‌లో స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకు స్థలం కేటాయించలేదన్నారు. దీంతో పాటు పశువర్ధక శాఖ అధీనంలో ఉన్న స్థలంలో తాత్కాలిక మార్కెట్ నిర్వహిస్తుంటే వారు సైతం ఖాళీ చేయించారని వాపోయారు. మార్కెట్ నిర్వహణకు స్థలం లేక పూల వ్యాపారులు రోడ్డున పడ్డామన్నారు. కావున నూతన మార్కెట్ కింద ఖాళీ స్థలాన్ని కేటాయించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణ, కాంగ్రెస్ శ్యామ్‌కిరణ్, ఆర్‌సిపి శ్రీనివాసులు, బిఎస్‌పి శ్రీరాములు, ఎంఐఎం మున్నా, వివిధ పార్టీల నాయకులు హరి, కలీం, కృష్ణప్ప, ఫిరోజ్, శ్రీనివాస్, పూల వ్యాపారులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పూల వ్యాపారులు

సరిహద్దులో మరింత నిఘా పెంచాలి

ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

పుట్టపర్తి రూరల్ : నాటుసారా, కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా జిల్లాలోని సరిహద్దుల్లో మరింత నిఘా పెంచాలని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని సెబ్ అధికారుల పనితీ రు, ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాష్ట్ర సరిహద్దులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సెబ్ చెక్‌పోస్టుల వద్ద నిరంతర పర్యవేక్షిస్తుండలన్నారు. ముఖ్యంగా పేదలు నాటుసారా జోలికెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో స్థానిక పోలీసులను సమన్వయం చేసుకుంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం వివిధ సేబ్‌స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసు వివరాలు, నమోదైన కేసులు, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేసి కోర్టులో నంబరింగ్ తీసుకుని సిసి టిఎన్ఎస్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాల సంఖ్యను ఆయా స్టేషన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకల పెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. జిల్లాలో నాటుసారా తయారీ, విక్రయించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎన్‌డిపిఎల్ డిపిఎల్‌పై ఉక్కుపాదం మోపాలన్నారు. అలాగే పాత నేరస్తులు మళ్లీ నేరాలకు ఒడిగడితే కేసులతోపాటు బైండోవర్లు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెబ్ అధికారి కెవి రామకృష్ణప్రసాద్, సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, జిల్లాలోని సెబ్ సిఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

సమస్యల పరిష్కారానికి సన్నద్ధం కండి

మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రతి కార్మికుడూ సన్నద్ధం కావాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక గాంధీనగర్ వాటర్ ట్యాంక్ వద్ద జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పర్మినెంట్ సిబ్బందితోపాటు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల రోజువారి పనికి సంబంధించిన హాజరు, ఎపి ఎఫ్ఆర్ఎస్ విధానంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులు మన జీతాలకే గాక ఉద్యోగాలకు కూడా ఎసరుపెట్టే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 2022 జూలై సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిని ఎదుర్కొనే హామీలు అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి పోరాటానికి మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులందరూ సన్నద్ధం కావాలన్నారు. ఈనెల 16న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు, ప్రదర్శనతో నిరసనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అయినా స్పందించకపోతే చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునివ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష, కార్యద్శులు ఆదినారాయణ, అయూబ్బాన్, సత్యసాయి జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, లక్ష్మీనారాయణ, ఆటో యూనియన్ రాష్ట్ర నాయకులు రఫీ, పట్టణ మున్సిపల్ పారిశుధ్య కార్మికసంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అగ్రిల్యాబ్‌తో రైతులకు మెరుగైన సేవలు

రీజినల్ కోడింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున



అగ్రి టెస్ట్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-కొత్తచెరువు

అగ్రిల్యాబ్ ద్వారా నియోజకవర్గంలోని రైతులందరికీ మెరుగైన సేవలు అందించనున్నట్లు తిరుపతి రీజినల్ కోడింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. గురువారం కొత్తచెరువులోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఈ కేంద్రాన్ని ప్రారంభించి రైతులకు సంబంధించిన ఎరువులు, పురుగుల మందులు, ఇతర పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా రైతులు ఇక్కడే భూసార పరీక్షలు నిర్వహించుకుని అధికారుల సలహాలు, సూచనలతో పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఎడిఎ స్వయంప్రభ, వ్యవసాయ అధికారి నటరాజు, ఎఇఒ ఉపేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ధర్మవరం మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మిస్తున్న వైఎస్ఆర్ ఆగ్రీ టెస్ట్ ల్యాబ్‌లో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, మందుల నాణ్యత పరీక్షలను చేయాలని తిరుపతి రీజినల్ కోడింగ్ సెంటర్ అగ్రికల్చర్ అఫ్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. ఈమేరకు గురువారం మార్కెట్ యార్డులోని నూతనంగా నిర్మిస్తున్న వైఎస్ఆర్ అగ్రిటెస్ట్ ల్యాబ్‌ను సందర్శించారు. ఇందులో భాగంగా ల్యాబ్‌లో అన్ని పరీక్షలకు సంబంధించి స్టాప్, పరికరాలను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి వైవి సుబ్బారావు, ఎడిఎ క్రిష్టయ్య, ఎఒ చిన్నవీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రీ టెస్టింగ్ ప్రయోగశాలను తిరుపతి రీజినల్ కోడింగ్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మల్లికార్జునయ్య గురువారం సందర్శించారు. ఇందులో భాగంగా సెంటర్‌లోని ఎరువులు, విత్తనాలు నాణ్యత పరీక్షలు, మౌలిక వసతులపై ఆరాతీశారు. అలాగే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు ఈ ప్రయోగశాలలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు స్వయంప్రభ, మండల వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్, ల్యాబ్ సహాయకులు చక్రపాణి రెడ్డి, నరసింహ మూర్తి ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దాడులను ప్రోత్సహించడం హేయం

ప్రజాశక్తి-రామగిరి


కూల్చిన భవనాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

న్యాయవాది వృత్తిలో ఉంటున్న నాగిరెడ్డి ఇళ్ల కూల్చివేత వంటి దాడులను ప్రోత్సహించడం బాధాకరమని సిపిఎం నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని పేరూరులో న్యాయవాది నాగిరెడ్డి రిజిస్ట్రేషన్ పత్రాల్లో లేని దారి కావాలని దౌర్జన్యంగా మంగళవారం రాత్రి బడికి నాగభూషణకు చెందిన భవనానికి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, కోర్టుకు సంబంధించిన బోర్డులను జెసిబి ద్వారా ధ్వంసం చేసిన విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు గురువారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, నామాల నాగార్జున, కదిరప్ప, మారుతి వారు మాట్లాడుతూ న్యాయవాది నాగిరెడ్డికి, బడికి నాగభూషణం మధ్య గత ఆరేళ్లుగా దారి సమస్యల నడుస్తోందన్నారు. ఈ విషయమై కోర్టులో కేసు కూడా నడుస్తోందన్నారు. దీంతో కోర్టు ఇచ్చిన ఆదేశాలను నాగభూషణం బోర్డులో ఏర్పాటు చేశాడు. దీంతో పాటు భవనానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నాడు. ఈనేపథ్యంలో నాగిరెడ్డి ఉన్నట్టుండి తన అనుచరులతో మంగళవారం రాత్రి సీసీకెమెరాలు, కోర్టు కు సంబంధించిన ఆదేశాల బోర్డును ధ్వంసం చేశాడన్నారు. నాగిరెడ్డి వృత్తిరిత్యా న్యాయవాదిగా పని చేస్తూ కోర్టునే ధిక్కరించడం బాధాకరమన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని దుర్గానగర్‌లో వెలసిన శీతల దేవీసమేత రామలింగేశ్వరస్వామి ఆలయం ఎదుట ఉన్న ధ్వజస్తంభాన్ని ఘనంగా ప్రతిష్టించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం సహిత దీక్ష, హోమాలు, వేద పారాయణం అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సాకే చిన్నక్రిష్ణ, బెస్త రామకృష్ణ, రామాంజినేయులు, లక్ష్మీనారాయణ, రామ పెద్దపోతలయ్య, నాగరాజు, నారాయణస్వామి, బాబయ్య, అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.


ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దశ్యం

కాయగూరల మార్కెట్ నిర్మాణం చారిత్రాత్మకం

నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం - ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్


కాయగూరల మార్కెట్ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మల

ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే విధంగా నూతనంగా నిర్మించిన కేతిరెడ్డి సూర్యప్రతాపరెడ్డి కాయగూరల మార్కెట్ భవన సముదాయం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. పట్టణంలో రూ.8కోట్లతో నూతనంగా నిర్మించిన ఆధునిక కాయగూరల మార్కెట్‌ను ఎమ్మెల్యే కేతిరెడ్డి గురువారం ప్రారంభించారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మార్కెట్ మధ్యలో ఏర్పాటు చేసిన మహానేత వైఎస్ఆర్ విగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం మార్కెట్‌లోని ఒక్కో గదినీ మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులు రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. గుడ్‌విల్ పద్ధతిన ప్రజలు, వ్యాపారుల భాగస్వామ్యంతో నూతనంగా నిర్మించిన మార్కెట్ కారణంగా మున్సిపాలిటీకి రూ.8కోట్ల ఆస్తి సమకూరడంతోపాటు ప్రతినెలా అద్దెల రూపంలో రూ.8లక్షల దాకా ఆదాయం సమకూరనున్నట్లు తెలిపారు. కాగా నూతన మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుడితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న దుర్బుద్ధితో టిడిపి నాయకులు కోర్టు కెళ్లి నానా కుట్రలు చేశారన్నారు. అయినా ప్రజల ఆశీర్వాదం వాటినన్నింటినీ అధిగమించి మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. ధర్మవరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురద చల్లుతున్నామన్నారు. వారి దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ ఛైర్మన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో పాటు 40వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపండి మహాప్రభో..

ప్రజాశక్తి-మడకశిర రూరల్


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పాఠశాల, కళాశాలల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని పలువురు విద్యార్థులు డిమాండ్ చేశారు. పాఠశాలకు వెళ్లేందుకు సమయానికి బస్సు రాకపోవడంతో గురువారం మండల పరిధిలోని జమ్మనపల్లి గ్రామంలో దాదాపు 150 మంది విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ బస్సులు సమయానికి రాకపోవడంతో గౌడనహళ్లి పాఠశాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నామని వాపోయారు. బస్సు రాకపోతే కాలి నడకన ఏడు మైళ్ల దూరం నవడాల్సి వస్తోందన్నారు. సమయపాలన లేకుండా బస్సు రావడంతో పాఠశాలలకు లేటుగా వెళ్లడం, లేకుంటే ఇళ్లకు తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘం నాయకులతో కలిసి ఆర్టీసీ డిపో వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న సబితమ్మ

గర్భిణులకు అన్నదానం

పెనుకొండ : మండలంలోని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ సవితమ్మ స్వయానా గర్భిణులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో త్రివేంద్రనాయుడు, నంజప్ప, వాసుదేవరెడ్డి, చిన్నపోతన్న, వీరచిన్న బుసప్ప సిద్ధు, నిమ్మకాయల రామంజి, మద్దిలేటి, హేమంత్, నరేంద్ర, రంగనాథ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యపరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు టిడిపి నాయకురాలు సవితమ్మ గురువారం అన్నదానం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అన్నారు. అందుకోసంఏ భోజనం వసతి కల్పించినట్లు తెలిపారు.

బాధితున్ని పరామర్శించిన బికె

రొద్దం : అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని చోలేమరి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కుళ్లాయప్పను టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి గురువారం పరామర్శించారు. కుళ్లాయప్ప గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో ఎఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బికె పార్థసారధి పరామర్శించారు. ఆయన వెంట భానుకీర్తి స్వామి, నీరుగంటి చంద్ర పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిర : మండల పరిధిలోని ఆర్.అనంతపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సబ్‌స్టేషన్ పరిధిలోని రైతులు, ప్రజలు, విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించాలని కోరారు.

శివాలయానికి విరాళం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని ఎనుములపల్లిలో వెలసిన శివాలయానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

నల్లచెరువు : మండల పరిధిలోని కొత్తచెరువు దగ్గర చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులను ఎంపిడిఒ శకుంతల గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలందరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం క్యూబిక్ మీటర్‌కు రూ.125 అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బావాజీ, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ శకుంతల

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి-నల్లచెరువు


వ్యవసాయ అధికారిణి భారతికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎపి రైతుసంఘం నాయకులు విమర్శించారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ అధికారిణి భారతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యంగా ఈసారి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కేవలం కార్పొరేట్ సంస్థలు, భూస్వాములకు అనుకూలంగా బడ్జెట్ ఉందని ఆరోపించారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, ఎరువులు, పురుగు మందులు, సబ్సిడీకి అందించకుండా ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, మందులను సబ్సిడీకి అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నాయకులు టి.శ్రీరాములు, ఇ.వి.రమణ, శంకర్, వెంకటస్వామి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-గాండ్లపెంట


ఇఒఆర్‌డి సునీతకు వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు ప్రతినెల వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇఒఆర్‌డి సునీత వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి కార్మికులకు జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతినెలా జీతాలు అందించాలని పలుసార్లు అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోలేదన్నారు. కావున ఇప్పటికైనా స్పందించి వెంటనే అధికారులు ప్రతినెలా కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు. ఇందుకు ఇఒఆర్‌డి స్పందిస్తూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించి ప్రతినెలా వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు కదిరప్ప నరసింహులు అక్కులప్ప అనిల్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు

కుష్టు వ్యాధిపై విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి-పరిగి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మండలంలోని కేజీబీవీ పాఠశాలలో కుష్టువ్యాధి, వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు స్వరూపారెడ్డి గురువారం అవగాహన కల్పించారు. ముందుగా సచివాలయాల పరిధిలోని వివిధ గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కుష్టువ్యాధి లక్షణాలను వివరించారు. ఈ సందర్భంగా స్వరూపారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేకుండా మహిళలు, పురుషులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బృందం వన్నప్పతోపాటు కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న క్వార్టర్స్‌ను పరిశీలించారు. వీటిలో కొన్ని ఆక్రమణకు గురవడంతో వారం రోజుల్లోపు క్వార్టర్స్ ఖాళీ చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అప్పజెప్పాలని హెచ్చరించారు.

పంట నమోదుతోనే పథకాల వర్తింపు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్


గొట్లూరులో ఈ పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వైవి సుబ్బారావు

రబీలో రైతులు సాగుచేసిన పంటలను ఈ పంటలో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలను వర్తిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు తెలిపారు. గురువారం మండలంలోని గొట్లూరు గ్రామంలో రబీలు సాగు చేసిన పంటలకు చేస్తున్న ఈక్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల నమోదులో ఎలాంటి తప్పుల్లేకుండా చూసుకోవాలని గ్రామ వ్యవసాయాధికారికి సూచించారు. ఆయన వెంట ఎడిఎ క్రిష్టయ్య, ఎఒ చెన్నవీరస్వామి, గ్రామ వ్యవసాయాధికారి గురుచరిత్, రైతులు పాల్గొన్నారు.

రబీసాగులో మెళకువలు అవసరం

ప్రజాశక్తి-పరిగి


రబీసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ విజయభారతి

రబీలో పంటలు సాగు చేసిన రైతులు అధికారుల సలహాలు, సూచనలతోపాటు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని వ్యవసాయ అధికారిణి విజయభారతి సూచించారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రబీలో సాగు చేసిన పంటల నమోదులో భాగంగా రాగి పంటను పరిశీలించారు. ఇందులో భాగంగా నారుమడి నుంచి ప్రధాన పొలంలో రాగి నాటేటప్పటి వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అదేవిధంగా రాగి పైరు నాటిన వారం రోజుల తర్వాత మాత్రమే మొదటి తడిని ఇవ్వాలన్నారు. పిలకలు వేసే దశ, చిరు పొట్ట దశ, పూత గింజ కట్టే దశలో నీటి ఎద్దడి పైరు గురి కాకుండా చేసుకోవాలన్నారు. అప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రుక్సానా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

గాండ్లపెంట : ప్రధానమంత్రి సురక్ష అమృత అభియాన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి ఉమామహేశ్వర్ మారుతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 41 గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించగా 25 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించినట్లు తెలిపారు. దీంతో వారికి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బాబా ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులు అన్నదానం చేస్తున్న దృశ్యం

తలుపుల : ప్రధానమంత్రి సురక్ష అమృత అభియాన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హైరిస్క్ గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో 76 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించగా 12 మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. అలాగే 14 మందిని ఉచిత అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం కదిరికి పంపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మున్వర్‌బాషా, విటి.రోజా తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌కు కొడిగినహళ్లి విద్యార్థి

పరిగి : మండలంలోని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల విద్యార్థి నిఖిల్ బీహార్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ అథ్లెటిక్ మీట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి చదువుతున్న జి.నిఖిల్ 600 మీటర్ల పరుగు పందెం విభాగంలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నా నగరంలో నిర్వహించే జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

బనాన్‌చెరువుపల్లెలో పొలంబడి

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల పరిధిలోని మల్లమీదపల్లి సచివాలయ పరిధిలో ఉన్న బనాన్ చెరువుపల్లిలో వ్యవసాయ అధికారులు గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాంగా రైతు భాస్కర్‌రెడ్డి సాగు చేసిన పొలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కదిరి ఎడిఎ సత్యనారాయణ, ఎఒ లక్ష్మీప్రియ మాట్లాడుతూ రబీలో బోర్లు, బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటలో పాటించాల్సిన పద్ధతులను వివరించారు. ముఖ్యంగా చీడపీడల నివారణ, సహజ శుద్ధి వనరులతో సాగు, భూసార పరీక్షలను బట్టి ఎరువులు, నాణ్యమైన విత్తనాలు వాడకం, పర్యావరణ పరిరక్షణ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. తర్వాత శత్రు పురుగులు, మిత్ర పురుగులు పొలంలో గుర్తించే లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలను పక్ష స్థావరాలో ఏర్పాటు చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ ఏర్పాటు

పెనుకొండ : పట్టణంలోని బిసి వెల్ఫేర్ బాయ్స్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన ఆర్‌ఒ వాటర్‌ప్లాంట్‌ను హాస్టల్ అధికారి గంగాధర్ గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో నెలకొన్న నీటి సమస్యలను స్థానిక సిబ్బంది తన దృష్టికి తీసుకురావడంతో తాను సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ యంవి రావుకి సమస్యను విన్నవించగా 500 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీ గగన్ మహల్ సంస్థ అధ్యక్షులు, న్యాయవాది జె. ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసు నిందితులు అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సిఐ

హిందూపురం : ఫిబ్రవరి 1న చిలమత్తూరు సోమగట్టలో జరిగిన దొడ్డి నాగరాజు హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈమేరకు సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిఐ వేణుగోపాల్ మాట్లాడుతూ మృతుడు దొడ్డి నాగరాజు గ్రామంలోని పలువురు మహిళలతో అక్రమ సంబంధాలు పెట్టుకుని చెడు వ్యసనాలకు అలవాటు పడి గ్రామంలో తిరుగుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో నెల రోజుల క్రితం సోమగట్ట గ్రామానికి చెందిన అంజినప్ప కూతురుపై కన్నేసి ఇంటి వద్ద తరుచూ తిరుగుతున్నాడు. గమనించిన అంజినప్ప కుటుంబ సభ్యులు నాగరాజును మందలించారు. అయినా వినలేదు. ఇదే క్రమంలో నాగరాజు తండ్రి శివప్ప 15 రోజుల క్రితం డబ్బు విషయమై గొడవ పడ్డారు. దీంతో నాగరాజు తండ్రి శివప్పను కొట్టాడు. దీంతో శివప్ప కక్ష పెంచుకుని అదేరోజు ముద్దాయిలు నల్లమారి, అంజనప్ప కలిసి నాగరాజును హతమార్చాలని పతకం రూపొందించుకున్నారు. పతకం ప్రకారం అంజనప్ప నీటి పైపు రిపేరీ ఉందని చెప్పి అప్పటికే తీసిన గుంత వద్దకు తీసుకెళ్లారు. నీటి పైపు రిపేరి చేస్తుండగా అంజనప్ప కొడవలి తీసుకొని నాగరాజు తల నరికాడు. దీంతో నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నల్లమారి అంజినప్ప, మృతుడు తండ్రిదొడ్డి శివప్ప చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడు మృతి


యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

చిలమత్తూరు : మండల పరిధిలోని శెట్టిపట్టి గ్రామ సమీపంలోని చెరువు వద్ద శెట్టిపల్లి గ్రామానికి చెందిన గణేష్ (24) విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలుపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈమేరకు గణేష్ మేనత్త తన కూతురుని ఇచ్చి పెళ్లి చేస్తానని చెప్పి గణేష్ వద్ద కొంత డబ్బులు తీసుకుంది. అయితే కూతురుని ఇవ్వకుండా మోసం చేసింది.దీంతో మనస్థాపం చెంది చెరువు సమీపంలోకి వెళ్లి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గణేష్ తండ్రి శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మెడికల్ స్టోర్‌లో నగదు చోరీ

గోరంట్ల : పట్టణంలో గ్రామ చావడి ఎదురుగా ఉన్న మహాదేవ్ మెడికల్ స్టోర్‌లో గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. బాధితుడు డాక్టర్ రామయ్య తెలిపిన వివరాల మేరకు.. మెడికల్ స్టోర్‌లోని క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.25వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా..విద్యార్థులకు గాయాలు

అమరాపురం : మండల పరిధిలోని హేమావతి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం ఆటో అదుపు తప్పి కింద పడటంతో విద్యార్థులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... హేమావతికి చెందిన ఇంటర్ విద్యార్థులు కళాశాలకు ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు త్రివేణి, చరిత, శివమ్మ, సౌమ్య, వేద, చందన గాయపడ్డారు. వెంటనే స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం అమరాపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మడకశిర, హిందూపురం, కర్ణాటక రాష్ట్రంలోని సిరా తదితర ప్రాంతాలకు తరలించినట్లు బంధువులు తెలిపారు.


టైల్స్‌షాపులో చోరీ

ధర్మవరం టౌన్ : పట్టణంలో గాంధీనగర్‌లో ఉన్న మణికంఠ టైల్స్‌షాపులో ఐదుగురు గురువారం సాయంత్రం వచ్చి దాడి చేసి టైల్స్ బాక్సులు ఎత్తుకెళ్లినట్లు మణికంఠ టైల్స్ యజమాని లక్ష్మీనాయక్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న వెంకటేశ్వర టైల్స్ యజమాని అశోక్ వ్యాపార లావాదేవీల్లో భాగంగా రూ.23వేలు తాను ఇవ్వాలని అందుకు బదులుగా టైల్స్‌బాక్సులు తీసుకెళ్లాలని లక్ష్మీనాయక్ తెలిపారు. అయితే అశోక్, అతని మనుషులు ఐదుగురు వచ్చి షాపులోని టైల్స్‌తోపాటు కౌంటర్‌ను పగులకొట్టి 300 టైల్స్ బాక్సులను ఎత్తుకెళ్లినట్లు వాపోయాడు. వీటి విలువ దాదాపు రూ.1.50లక్షలు ఉంటుందన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన విఆర్ఎ మృతి

బత్తలపల్లి : ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన విఆర్ఎ గంగాధర్ (33) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం మండలంలోని నల్లబోయినపల్లి గ్రామానికి చెందిన అభిరామ్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో తన గ్రామానికి వెళ్తుండగా డి.చెర్లోపల్లికి చెందిన విఆర్ఎ గంగాధర్ ఎక్కాడు. అయితే తంబాపురం క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. వీరిలో గంగాధర్ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరు తరలించారు. అయితే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా విఆర్ఒ మృతికి తహశీల్దార్ యుగేశ్వరీదేవి, డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, పలువురు కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం. చేశారు.

వన్‌టౌన్ సిఐగా ఈరన్న



హిందూపురం : హిందూపురం వన్‌టౌన్ సిఐగా విఆర్‌లో ఉన్న ఈరన్నను నియమిస్తూ రాయలసీమ ఐజి ఉత్తర్వులు విడుదల చేశారు. ఇక్కడ సిఐగా విధులు నిర్వహిస్తున్న ఇస్మాయిల్‌ను విఆర్‌కు పంపారు. దీంతో రెండవ స్టేషన్ సిఐగా ఉన్న వెంకటేశ్వర్లును ఇన్‌ఛార్జ్ సిఐగా నియమించారు. ఖాళీగా ఉన్న వన్‌టౌన్ సిఐ స్థానంలో ఈరన్నను నియమించారు.

పేదల సంక్షేమం.. జగనన్న లక్ష్యం : ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం : కుల,మతాలు, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరి సంక్షేమమే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. గురువారం పట్టణంలోని 16వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డిఎన్ ఇంద్రజ, వైస్‌ఛైర్మన్ జబీవుల్లా, వార్డు ఇన్‌ఛార్జి సలీం, వార్డు కౌన్సిలర్ జగ్గు, కౌన్సిలర్లు మల్లికార్జున, రహమత్ బి, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్